సావిత్రి

'యువ' మాస పత్రిక . . . జనవరి, 1975

"గోమాతాకి జై... గోమాత జిందాబాద్!"

నినాదాలు మిన్నుముడుతున్నాయి. 'అఖిల భారత గోసంవర్ధక సంఘం'వారు గోవధ నిషేధం కొరకు తలపెట్టిన ఉద్యమంలో భాగంగా ఆరోజు ఆ ప్రదర్శనను నిర్వహిస్తున్నారు.

ప్రదర్శన కలెక్టర్ ఆఫీసు ముందు జోరుగా సాగుతోంది. బక్కచిక్కిన ఒక ఆవును తెచ్చి ఆ గుంపుముందు పెట్టారు. దాని మెళ్లో ఒక బంతిపూల దండ వేశారు. దాని ముఖానికి పసుపు పూసి కుంకుమబొట్టు పెట్టారు. కొమ్ములకి రంగు వేశారు. ఆ ప్రదర్శన తోనూ, నినాదాల తోనూ తనకేమీ సంబంధం లేనట్లు నుంచోని వుంది ఆ గోవు. ఆ ఆవు నడుంమీద చేయివేసి నిమురుతూ... ఉద్రుతంగా నినాదాలను రాకెట్లలాగ వదులుతున్నాడు జైరాందాస్. ఆయన ఆ ఊరిలో పేరు మోసిన పెద్ద వ్యాపారి.

పేరుకి చేసేవి రకరకాల వ్యాపారాలు కాని, వాటి వెనకాల జరిగే అసలు వ్యాపారం వడ్డీ వ్యాపారం! మారువడ్డీలు వేసే మార్వాడి వ్యాపారం!! ఆయనే గోసంవర్ధక సంఘపు రాష్ట్ర శాఖకు అధ్యక్షుడు.

ఆయన నినాదాలు చేస్తుంటే అనుయాయులంతా వల్లిస్తున్నారు. ఆయన మెళ్లో దండ వేసుకుని, ముఖానికి గంధం పూసుకుని, దానిమీద ఈస్టిండియా కంపెనీవారి అర్ధణాకాసంత కుంకుమబొట్టు పెట్టుకుని అవతారమూర్తిలా అభినయిస్తున్నాడు. దగ్గరలోనే వున్న ఒక మేడమీద మైకు ఏర్పాటుచేసి, గోమాత గొప్పదనాన్ని తెలిపే పాట రికార్డును పదేపదే వేస్తున్నారు. ఈ కోలాహలాన్నంతా ఆసక్తితో తిలకిస్తున్నారు... అక్కడ చేరిన జనసమూహం! ఏ అవాంఛనీయ సంఘటనా జరుగకుండా ఉండడంకోసం పోలీసులు జనాన్నీ, ప్రదర్శకులనీ సర్దుతున్నారు. ఆ విధంగా సాగింది కొద్ది గంటలపాటు ప్రదర్శన.

మరికొంచెంసేపట్లో కలెక్టరుగారు ఆఫీసుకి వచ్చారు. ఆయన కారు వస్తుంటే ప్రదర్శకులు ఉప్పెనలా నినాదాలు వదిలారు. మరికొంచెంసేపట్లో జైరాందాసు నాయకత్వంలోని ఒక బృందం ఆఫీసులోనికి వెళ్లి కలెక్టర్‌గారికి వినతిపత్రాన్ని సమర్పించి తిరిగివచ్చింది. వెంటనే అక్కడ చేరిన ప్రదర్శకులు వారికి జైజై నినాదాలతో స్వాగతం తెలిపారు. వారంతా గోమాతని ముందు నిడుకొని, దాని ప్రక్కనే జైరాందాసు నడువగా, మిగిలినవారు వెంటరాగా,

"గోమాతకి జై.. గోమాత జిందాబాద్!' నినాదాలతో పెద్ద ఊరేగింపుగా పురవీధుల వెంట వెళ్ళిపోయారు. నాటికి ఆ ప్రదర్శన జయప్రదంగా ముగిసింది.

ఆరోజు ఆదివారం! జైరాందాసు దుకాణానికి సెలవు!!

ఆయన తన ఇంటిముందు తోటలో పచార్లు చేస్తున్నాడు. ఒకప్రక్కన ఎనిమిదేండ్ల మనుమరాలూ, మరొక ప్రక్కన ఐదేండ్ల మనుమడూ ఆయనకి చెరొకచేయీ పట్టుకొని తాతగారితో కబుర్లు చెబుతూ నడుస్తున్నారు.

వాళ్ళ ముద్దుముద్దు మాటలతో ఆయనకు బాగా కాలక్షేపం అవుతుంది. మనుమరాలు సుమ మొన్నటి ప్రదర్శనను గురించి వివరాలు అడుగుతుంటే జైరాందాసు- దాన్నంతా కాశీమజిలీ కథని చెప్పినట్లుగా వర్ణించి చెబుతున్నాడు. మనుమడు ఆయన చెప్పేది అర్థమయ్యీ, కాక ఏవేవో ప్రశ్నలు వేస్తున్నాడు.

జైరాందాస్ గోమాత ఎంత గొప్పదయినదీ, అది హిందువులకి ఎంత పవిత్రమైనదీ గట్టిగా నూరిపోస్తున్నాడు. వారు అలా మాట్లాడుకుంటూ పశువుల కొట్టం వైపు నడిచారు. పాలవాడు వచ్చి ఆవుకి పాలు పితుకుతున్నాడు. దూడని తల్లి దగ్గరకు రాకుండా గుంజకి కట్టివేశాడు. అది తల్లి దగ్గరికి పోవాలని గుంజుకుంటోంది- 'అంబా...' అని అరుస్తోంది. దాని అరుపులకి తల్లడిల్లిపోతోంది తల్లి ఆవు. నిస్సహాయంగా తాను కూడా ప్రతిగా 'అంబా...' అని అరుస్తోంది, పాలవాడి కట్టడి నుండి తప్పించుకోవాలని విఫలప్రయత్నం చేస్తోంది.

"ఏరా గోపిగా... లక్ష్మి ఏమంటోంది? ఇంకా, మకారు చేస్తునే ఉందా? దారికేమన్నా వచ్చిందా?" అనడిగాడు జైరాందాసు పొదుగు కడుగుతున్న పాలవాడిని చూసి. లక్ష్మి అంటే కొత్తగా కొన్న ఆ ఆవు.

"ఇంకా కొత్త పోలేదండీ బాబయ్యా- మకారు చేస్తూనే ఉందాది" అన్నాడు గోపన్న.

"ఊఁ... సరే... పాలెన్ని ఇస్తోంది?" అని తిరిగి ప్రశ్నించాడు జైరాందాస్.

"ఇప్పటికైతే పూటకి మూడు లీటర్లే ఇస్తోందండి! కొంచెం అలవాటైతే ఇంకా ఎక్కువ ఇస్తుంధండి!" అన్నాడు గోపన్న.

"ఇంతేనా? అంత డబ్బు పోసి కొంటే మూడేనా ఇచ్చేది? పాలు సరిగ్గా పితుకు తున్నావా? లేక అన్నీ దూడకే వదిలేస్తున్నావా?" అని గద్దిస్తూ, అనుమానంగా దూడవంక చూశాడు జైరాందాస్.

"ఎంత మాటయ్యగోరూ... గోవుల మధ్య పుట్టిపెరిగినవాడిని- చూస్తూ చూస్తూ దూడకి పాలు వదులుతానా? ఇప్పుడు మీరే చూస్తారుగా- దూడకి ఎన్ని పాలు వదులుతోందీ!" అంటూ పొదుగు కడగటం పూర్తిచేసి, దూడవైపు నడిచాడు గోపన్న.

దూడ కట్టువిప్పి వదిలాడు. ఛెంగున ఒక్కగంతులో తల్లి దగ్గరకి పరుగెత్తింది దూడ. తలతో పొదుగును క్రుమ్ముతూ తల్లి దగ్గర పాలు కుడవడం మొదలుపెట్టింది.

ఆ క్రుమ్ముడులో బాధ లేకపోగా అలౌకికానందాన్ని అనుభవించసాగింది ఆ తల్లిగోవు. అనిర్వచనీయమైన ఆనందంతో తొణికిసలాడే కళ్ళతో, ఆప్యాయంగా, దూడ ఒంటిని నాకడం మొదలుపెట్టింది.

గట్టిగా రెండు కుడుపులు కుడిచిందో, లేదో- బలవంతంగా దూడని ఇవతలికి ఈడ్చుకువచ్చి తిరిగి గుంజకి కట్టివేశాడు గోపన్న. చేసేది ఏమీలేక అసహాయంగా గుంజుకోడం మొదలుపెట్టింది దూడ. అది అరవను కూడా అరవకుండా దాని మూతికి చిక్కం బిగించాడు గోపన్న. తిరిగి వెళ్లి ఆవుకి పాలు పితకడం మొదలుపెట్టాడు.

'ఎన్ని పాలు వస్తాయా...' అని ఆసక్తిగా అటే చూడసాగాడు జైరాందాస్.

"తాతా... దూడ పాలు తాగడం అవకుండానే లాగేశాడు. దానికి ఆకలి వెయ్యదూ?" అని అడిగింది సుమ. దూడ గుంజుకోడం చూస్తుంటే ఆ చిన్నారి ప్రాణం పంజరంలో పక్షిలా కొట్టుకుంటోంది.

సుమ మాటల్తో ఈ లోకంలోకి వచ్చాడు జైరాందాస్. "లేదమ్మా... దూడకి ఆ పాలు చాలు!" అన్నాడు.

"అదేమిటి తాతా... దానికి కడుపు నిండందే? చూడు... అది ఎట్లా కొట్టుకుంటోందో?" అన్నాడు మనమడు.

"అవును తాతా... ఆకలి తీరకపోతే దూడ చచ్చిపోదూ?" అని వంత కలిపింది సుమ.

"మీకేం తెలీదు కుర్రసన్నాసుల్లారా! దూడ ఎక్కువ పాలు త్రాగకూడదు. ఎక్కువ త్రాగితే దానికి అజీర్తి చేసి చచ్చిపోతుంది!" అన్నాడు ముసిముసి నవ్వులు నవ్వుతూ జైరాందాస్.

తాత చెప్పిన విషయం నమ్మలేక, ఏమీ అనలేక ఒకరి ముఖలు ఒకరు చూసుకున్నారు మనుమలిద్దరూ.

గోపన్న పాలు పితకడం అయింది. జైరాందాస్ ఎదుటనే కొలిచి చూపాడు... అవి సుమారు మూడు లీటర్లు ఉన్నాయి.

"హుం..." అని నిట్టూర్చాడు జైరాందాస్.

"ఇట్లా అయితే పెట్టిన పెట్టుబడికి వడ్డీ కూడా గిట్టుబడి కాదు!"

– అంటూ ముందుకు సాగాడు. మౌనంగా అనుసరించారు మనుమలు.

జైరాందాస్‌కి ఉన్న వ్యాపారాలలో పాల వ్యాపారం కూడా ఒకటి! లక్ష్మి మంచి సంకరజాతి పశువనీ, పూటకి ఎనిమిది లీటర్ల పాలు ఇస్తోందనీ నమ్మకంగా చెప్తే కొన్నాడు. అది మూడు లీటర్లే ఇవ్వడం చూసి, తన పెట్టుబడి దండగేమోననీ, మోసపోయాడేమోననీ, దిగులుపట్టుకుంది. ఆ ఆలోచనలతోనే మౌనంగా ముందుకు నడుస్తూ బాగా ముందుకి సాగాడు.

దూడకి కడుపు నిండా పాలు పట్టకపోవడంతో, బరువెక్కిన జాలిగుండెలతో దూడ విషయమే ఆలోచించుకుంటూ మౌనంగా నడుస్తున్నారు ఆ పాపలు.

"తాతా... తాతా... అటుచూడు– తోటలో ఆవుపడి మేస్తోంది!" అని గట్టిగా అరిచింది సుమ.

అకస్మాత్తుగా జైరాందాస్ ఆలోచనలకు ఆనకట్ట పడింది. అవతలున్న చిన్నగేటు ఎవరో తీసేసి వెళ్లిపోయారు. ఒక బక్కచిక్కిన ఆవు తోటలోపడి మేస్తోంది. అటూ ఇటూ చూశాడు జైరాందాస్. ఎవ్వరూ కనిపించలేదు.

"ఒరేయ్ సుబ్బిగా... గోపీ... వెంకడూ... అంతా ఎక్కడ చచ్చార్రా?" అంటూ గావుకేక పెట్టాడు– అందర్నీ పేరుపేరునా పిలుస్తూ. దగ్గరలో ఎవరూ లేరేమో... అటు ఎవరూ రాలేదు.

నౌకర్ల అశ్రద్ధని తనలోనే తిట్టుకుంటూ ఆవు దిశగా పరుగు లంకించుకున్నాడు జైరాందాస్. పోతూ పోతూ దారిలో బడిసె కట్టె ఉంటే దానిని చేత చిక్కించుకున్నాడు.

"ఉష్... ఉష్... నీ మొహం మండా! నిన్ను తగలెయ్యా... నిన్ను బలివెయ్యా..." అంటూ తిడుతూ ఆవుని తరమసాగాడు జైరాందాస్.

యముడిలాగా తరుముకువస్తున్న జైరాందాస్‌ని చూసింది ఆవు. పరుగెత్తాలని ప్రయత్నం చేసింది. కాని, దానికి నిలబడడానికే ఓపిక లేదు. ఇంక పరుగేం తీస్తుంది?

అంతలోనే వచ్చాడు జైరాందాస్ సుడిగాలిలాగా. కోపం పట్టలేక చేతిలోనున్న బడితతో దాని నడుంమీద శక్తికొద్దీ బలంగా మోదాడు.

"అంబా..." అని అరుస్తూ అక్కడే కుప్పకూలిపోయింది ఆవు.

అప్పటికి సుమ, తమ్ముడూ అక్కడికి వచ్చారు. జరిగిన బీభత్సం చూసి బ్రాన్పడిపోయి భయంగా ప్రక్కకి ఒదిగి ఉండిపోయారు.

ఆవు కుప్పకూలి పోవడంతో తాను చేసినదేమిటో అర్థమయింది జైరాందాస్‌కి.

ఆవు చచ్చిపోయిందేమోనని భయపడ్డాడు. పేరుపేరునా నౌకర్లందరినీ పదేపదే పిలిచి గావుకేకలు పెట్టాడు.

అయ్యగారి అంకెలు విని ఏమి జరిగిందోనని పరుగెత్తుకు వచ్చారు నౌకర్లు. పడిపోయివున్న ఆవునీ, ప్రక్కనేవున్న బడితెనీ, వణికిపోతున్న యజమానినీ చూడగానే జరిగిందేమిటో అర్థమయ్యింది వాళ్ళకి.

"అట్లా చూస్తారేమర్రా వెధవల్లారా... అది చచ్చిందేమో చూడండి!" అని గర్జించాడు జైరాందాస్.

నౌకర్లు ముగ్గురూ ఆవు దగ్గరికి పరుగెత్తారు.

అది ఏటవాలుగా పడిపోయి, మెడ వ్రేలాడేసి, పైచూపులు చూస్తూ, నాలిక బయటకు వచ్చి నురుగులు కారుస్తూ, రొప్పుతోంది.

"అయ్యా... ప్రాణమైతే పోలేదు కాని, దెబ్బ గట్టిగా పడ్డట్టుంది!" అన్నాడు గోపన్న.

"అయ్యో దొరా... గోమాత సచ్చిపోనాది! ఇంత దెబ్బ కొట్టావేం దొరా!" అని బాధపడ్డాడు సుబ్బడు. వాడు జైరాందాస్ దగ్గర పాలేరు. ఆ ఆవుని చూస్తుంటే వాడికి కళ్ళు తిరిగాయి.

"ఏడిశావులే... తన అబ్బ సొత్తు దాచిపెట్టినట్లు! పడి మేస్తుంటే కొట్టకుండా నెత్తినెట్టుకుంటారా?" అని, "ఒరేయ్ః... దానిని బయటికి ఈడ్చేయండిరా! ఇక్కడే ఛస్తుందో ఏమో?!" అని అరిచాడు.

మరునిమిషంలో ముగ్గురూ సాయం పట్టి దానిని వీధిలోకి ఈడ్చేశారు.

దానిని ఈడవడం అంటేనే ఎంతో బాధపడ్డాడు సుబ్బడు. కానీ, ఏమీ చేయలేకపోయాడు. బయటికి చేరుస్తుండగానే దాని ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయి, దానికి ముక్తి లభించింది.

'గోరక్షక సంఘం'వారి వ్యాన్- ఆ దారంట వస్తూ, తనకేమీ పట్టనట్లుగానే ప్రక్కనుంచి దూసుకుపోయింది.

"గోమాత సచ్చిపోయింది దొరా!" అంటూ కళ్ళు వత్తుకున్నాడు సుబ్బడు.

"పోన్లేరా... భూభారం తగ్గింది!" అంటూ వెనక్కి మరలాడు జైరాందాస్.

"తాతా... గోమాత తల్లితో సమానం కదూ? దానిని కొట్టడం పాపం కదూ?" అని అడిగింది సుమ. ఆ మాటలు అంటుంటే ఆ చిన్నారికి దుఃఖం కట్టలు తెంచుకు వచ్చింది.

"చిన్న సన్నాసులు... పాపపుణ్యాల సంగతి మీకేం తెలుసు?" అని కసురుకున్నాడు జైరాందాస్.

ఇంక ఆ పాపలు ఏమీ మాట్లాడలేదు.

●

కొద్దిరోజులు మౌనంగా గడిచిపోయాయి. ఆరోజు -

"ఏం దొరా... కబురెట్టావు?" అంటూ వచ్చాడు సుబ్బడు.

"అవున్రా.. సావిత్రి వట్టిపోయింది. దానిని ఉంచుకోడం మేత దండుగ! దానిని సంతకి తోలుకుపోయి అమ్మేసేయి!" అన్నాడు జైరాం.

ఆ మాటలు సుబ్బడు చెవులకి పిడుగులా సోకాయి.

"ఏంటి దొరా నువ్వంటుందాది? మన సావిత్రినా అమ్మమంటోంది? అది గోమాతే కాదు బాబూ... ఈ ఇంటి మహాలక్ష్మి!" అన్నాడు సుబ్బడు బాధగా.

"ఏడిశావ్‌లేరా... చెప్పొచ్చావు! వట్టిపోయిన గొడ్డు... మహాలక్ష్మేమిటి? పోనీ అనుకున్నా అది ఈ ఇంటికి కాని, నీ ఇంటికి మహాలక్ష్మి కాదుగా? నా మహాలక్ష్మిని నేను అమ్మమంటే నీకేమి బాధ?" అన్నాడు జైరాందాస్.

"అంతమాట అనకు దొరా! అది నోరులేని గొడ్డయినా ఇంట్లోమనిషిగా పెరిగింది. ఈ ఇంటికి లక్ష్మిని తెచ్చింది. అయినా ఒట్టిపోయిన గొడ్డుని ఎవరు కొంటారు దొరా?" అన్నాడు సుబ్బడు ఆవేదనతో.

"ఇంకెవరు? కసాయివాడికి అమ్మేయి!" అన్నాడు జైరాందాస్ కర్కశంగా.

"దొరా... అంత మాటనకు!" అంటూ గుండెలు బాదుకుని ఏడవడం మొదలు పెట్టాడు సుబ్బడు. కాసేపటికి తేరుకుని- "దొరా... అంతగా అయితే దానిని నేనే తోలుకు పోతాను. దాని ఖరీదు నా జీతంలో పట్టుకోండి!" అన్నాడు.

"ఏమిట్రోయ్... గొడ్డుమాంసం తినే ముండాకొడుకువి. ఇంత జాలి ఒలకపోస్తా వేమిరా?" అన్నాడు జైరాందాస్ వ్యంగంగా.

"అయ్యా... నేను చచ్చిన గొడ్డుని తింటాను కాని, చంపి తినను బాబూ!" అన్నాడు సుబ్బడు చెప్పలేని ఆవేదనతో.

"నీతో వాగే తీరిక నాకు లేదు. నీవు కొనుక్కో దలుచుకుంటే డెబ్బయ్ రూపాయలు చేతిలో పోసి, ఇంకో రెండుగంటల్లో తోలుకువెళ్లు! లేదా ఇంకెవరికైనా అమ్మేస్తాను. సాయంత్రానికి పెద్దపెద్దవాళ్ళు మన పశువులు చూడ్డానికి వస్తున్నారు. అప్పటికి ఇది

ఉండడానికి వీలులేదు. మళ్లీ చెప్తున్నాను... కావాలనుకుంటే పైసలు చేతిలో పోసి పట్టుకుపో! జీతంలో గీతంలో పట్టుకోమంటే మాత్రం పట్టుకునేది లేదు. లేకుంటే వేరే అమ్మేస్తాను!" అంటూ లోనికిపోయి ధడాలున తలుపేసుకున్నాడు జైరాందాస్.

సుబ్బడు ఆఘమేఘాల మీద ఇంటికి పరుగెత్తాడు. పెళ్ళాం పుస్తెలతాడు తీసుకువచ్చి అమ్మి పైసలు తీసుకున్నాడు. రొప్పుతూ తిరిగి జైరాందాస్ ఇంటికి పరుగెత్తుకు వచ్చాడు.

"దొరా... ఇదుగో- పైసలు పట్టుకొచ్చాను!" అంటూ తలుపులు దడదడ కొట్టాడు.

తలుపు తీసి యమదేవతలాగా ఎదురుగా నిల్చున్నాడు జైరాందాస్.

"నిజంగా పైసలు తెచ్చావేరా? నువ్వేం కొంటావులే... అని కసాయివాడికి ఎనభైకి ఇందాకనే అమ్మేశాను!" అన్నాడు తాపీగా.

"దొరా... ఎంతపని చేశావు?" అని గట్టిగా అరిచి, తిరిగి కబేళా వైపు పరుగు లంకించుకున్నాడు సుబ్బడు- "సావిత్రీ..." అని వెర్రిగా అరుస్తూ.

●

దూరాన కబేళాలోంచి పశువుల అరుపులు వినిపిస్తున్నాయి.

వాటిల్లో తన సావిత్రి అరుపు గుర్తుపట్టున్నాడు సుబ్బడు. అడుగులు లేచిపోతున్నా, గుండెలు అదిరిపోతున్నా "సావిత్రీ..." అని అరుచుకుంటూ పరుగులెత్తుతున్నాడు సుబ్బడు. ఎలాగైతేనేం... కబేళా చేరాడు.

ఎదురుగా నేలమీద నెత్తుటి మడుగులో సావిత్రి పడివుంది!

తలా, మొండెం వేరై జైరాందాస్ ఉపన్యాస ఝరిలా, దాని మెడనుంచి రక్తం ప్రవహిస్తోంది. దాని కళ్ళు దీనంగా సుబ్బడివంకే చూస్తున్నాయి.

"సావిత్రీ..." అంటూ కుప్పకూలిపోయాడు సుబ్బడు.

అసలే పరుగెత్తి పరుగెత్తి అలసిపోయాడేమో- అనాయాసంగా హంస లేచిపోయింది. దూరాన 'గోసంవర్ధక సంఘం' వారి 'గోమాతాకి జై! గోమాతా జిందాబాద్' అనే నినాదాలు మిన్నుముట్టున్నాయి. మైకులో గోసంరక్షణ యొక్క అవశ్యకత గురించి జైరాందాస్ ఉపన్యాసం వినిపిస్తోంది. అది విని కబేళాలో కత్తులు కణకణమని నవ్వుకుంటున్నాయి.

'యువ' మాస పత్రిక . . . జనవరి, 1975